క్లుప్తంగా

నాగశిలలతో రాహు కేతు పూజ


భక్తుల వద్ద దొరికిన నాగశిలలు

శ్రీకాళహస్తి : ఓ తమిళ నాడు భక్తుడు బుధ వారం నాగశిలను గుడ్డలో చుట్టుకుని రాహు కేతు మండ పంలో పూజ చేసుకుని ఆలయం లోకి వెళ్లడం చర్చనీయాంశమైంది. దీనిపై ఆలయ ఉన్నతాధికారి, కూటమి నేతలు స్పందించకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు శివలింగం, నంది ప్రతిమలను ఆలయంలో వదిలి వెళ్లారు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. సూప రింటెండెంట్, ఏఈవోను సస్పెండ్ చేశారు. తాజాగా బుధవారం రూ.750 రాహు కేతు మండపాల్లోకి నాగశిలను తీసుకెళ్లినా ఆలయ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపైన పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రేణిగుంట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గాజులమండ్యం సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. ఆయన గురువారం తిరుపతి విమానాశ్రయం ఆవరణలో సీఐఎస్ఎఫ్ సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్, ఓటీపీ, లోన్ యాప్‌లు, హనిట్రాప్ మోసాల గురించి వివరించారు. ఎస్ఐ ప్రవల్లిక, సైబర్ సెల్ సిబ్బంది రాజు, ధన పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో పోలీసు కవాతు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు కానిస్టేబుళ్లు గురువారం రాత్రి పట్టణంలో కవాతు నిర్వహించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేతనాల కోసం నిరసన


బూట్ల పరిశ్రమ వద్ద కార్మికుల నిరసన

వరదయ్యపాళెం: మండలంలోని కురింజల్లం గ్రామ సమీపంలో ఉన్న ప్రైవేటు బూట్లు తయారీ పరిశ్రమ మహిళా కార్మికులు గురువారం నిరసన తెలిపారు. 3 నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. వేతనాల కోసం గట్టిగా పట్టుబడితే ఏకంగా కంపెనీ మూసి వేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులను ఇబ్బంది పెడుతున్న పరిశ్రమ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేర సమీక్షా సమావేశం


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట: రేణిగుంట పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులపై ఆరా తీశారు. రాత్రిళ్ల గస్తీ నిర్వహించాలని, బీట్స్ పెంపు, నేరాల నివారణ, రౌడీ షీటర్లపై నిఘా, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో రేణిగుంట అర్బన్, రూరల్ సీఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు టీవీ సుధాకర్, శ్రీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే దిక్కు

- ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక ఇక్కట్లు


మరుగుదొడ్డిలేని హౌసింగ్ కార్యాలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని తహశీల్దార్, ఎంపీడీఓ, ప్రభుత్వాసుపత్రి, వ్యవసాయశాఖ, ఉపాధిహామీ, వెలుగు మండల సమాఖ్య, పశువైద్యశాల, ట్రాన్స్‌కో, పోలీస్‌స్టేషన్, హౌసింగ్, కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేవు. దీంతో సిబ్బంది, మండల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం రోజుకు 200 మందికి పైగా వస్తుంటారు. అధికారులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద మరుగుదొడ్లు తప్పనిసరిగా నిర్మించుకోవాలని గ్రామాల్లో పర్యటిస్తూ, మరుగుదొడ్ల ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు. అయితే అధికారులు కార్యాలయాల ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించుకోవడం మరచిపోయారు. రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయాల లోపల తహశీల్దార్, ఎంపీడీఓలకు మాత్రమే వాడుకోవడానికి మరుగుదొడ్లు ఉన్నాయి. మిగిలిన అధికారులు, కిందిస్థాయి సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు మల, మూత్ర విసర్జన కోసం ఆరుబయటకు పరుగులు తీస్తున్నారు. మహిళ ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్త కార్యాలయాలకు వచ్చే మహిళల బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా ఐకేపీ కార్యాలయానికి ప్రతి రోజు పదుల సంఖ్యలో మహిళలు వస్తుంటారు. అధికారులు కార్యాలయాల ఆవరణలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయకుండా ప్రజలను మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెప్పడం సమంజసం కాదంటున్నారు. జిల్లా కలెక్టరు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది

ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చినపుడు మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. బహిరంగ మలమూత్ర విసర్జన వద్దని అవగాహన కల్పిస్తున్న అధికారుల కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక పోవడం దారుణం. ప్రతి కార్యాలయం పరిధిలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలి. – రమణయ్య, బీఎన్‌కండ్రిగ

మరుగుదొడ్డి నిర్మిస్తాం

మరుగుదొడ్లు లేక కార్యాలయాలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్న మాట వాస్తవమే. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వ్యవసాయ కార్యాలయంలో త్వరలోనే ప్రజా మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రయత్నిస్తాం. – షణ్ముగం, ఏఓ


ఎంపీడీఓ కార్యాలయం


మరుగుదొడ్డి లేని వ్యవసాయ కార్యాలయం


ప్రభుత్వాసుపత్రి ఆవరణ


ఉపాధిహామీ, ఐకేపీ కార్యాలయాలు


తహశీల్దార్ కార్యాలయం

వైద్య పరీక్షలు చేసుకోవాలి


గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కవిత

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని, ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని వైద్యాధికారి కవిత తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుంటే రక్తహీనత, ఎయిడ్స్ వ్యాధుల వివరాలు తెలుస్తాయన్నారు. గర్భవతులు మందులను వాడితే కడుపులోని బిడ్డ క్షేమంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చే మాత్రలను క్రమం తప్పకుండా, తప్పనిసరిగా వాడాలన్నారు. గర్భవతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశులు, నోడల్ అధికారి జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

వరవ కాలువకు మరమ్మతులు చేయండి


చెరువులో నిరసన తెలుపుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కరకంబట్టు చెరువుకు నీరందించే వరవ కాలువకు మరమ్మతులు చేపట్టి, చెరువుకు తెలుగుగంగ నీటిని అందించాలని గురువారం రైతులు ఖాళీ చెరువులో నిలుచుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ కరకంబట్టు చెరువుకు నీరందించే వరవ కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చెరువులోకి చుక్కనీరు రావడం లేదని తెలిపారు. చెరువులోకి నీరు రాకపోవడంతో పంటలు వేయలేదని, దీంతో పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో నీరులేక పంటలు పండకపోవడంతో వలసలు వెళ్లుతున్నామని వాపోయారు. తెలుగుగంగ బ్రాంచి కాలువ లేకపోవడం, వరవ కాలువ మరమ్మతులకు గురికావడంతో చెరువుకు తెలుగుగంగ నీరు రావడం లేదన్నారు. గంగనీరు చెరువుకు చేరడం కోసం ఉపకాలువను తవ్వించాలని తెలిపారు. చెరువు చెట్లు, పుట్టలతో నిండిపోయి ఉందని తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చెరువు నీరందించే వరవ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

పిల్లల పోషణపై శ్రద్ధ చూపాలి

తొట్టంబేడు: పిల్లల పోషణపై తల్లిదండ్రుల శ్రద్ధ చూపాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలన్నారు. ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వసంతబాయి, సీడీపీవో శాంతిదుర్గ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్త హీనత రాకుండా చూడవచ్చని చెప్పారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన తృణ ధాన్యాల స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి, అర్చన మునిరత్నం, రావిళ్ల మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు, జయచంద్రనాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడికి గాయాలు


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

రేణిగుంట: రేణిగుంట సమీపంలోని సీఆర్ఎస్‌లో గురువారం రైల్వే షెల్టర్‌కు పెయింటింగ్ వేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. సిబ్బంది కథనం మేరకు.. కాంట్రాక్ట్ కార్మికులు శివాజీ, డేవిడ్, శీను సీఆర్ఎస్‌లో పెయింటింగ్ వేసే పనులకు వచ్చారు. రైల్వే షెల్టర్‌కు పెయింటింగ్ వేస్తుండగా విద్యుత్ లైన్ తగలడంతో వై.శివాజీ (23) షాక్‌కు గురయ్యాడు. దీంతో అతను 20 అడుగుల పైనుంచి కింద పడ్డాడు. తలకు, నడుము, తొడ భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని అతన్ని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శివాజీ కోమాలో వున్నాడని డాక్టర్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, సీఆర్ఎస్ రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె.ఈశ్వరమ్మ, అధ్యక్షురాలు అమ్ములమ్మ ఆస్పత్రికి చేరుకున్నారు. శివాజీ భార్య లహరి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ రైల్వేలో క్లీనింగ్ ఇన్‌చార్జ్ వరప్రసాద్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. శివాజీకి మెరుగైన వైద్యం అందించడంతోపాటు నష్టపరిహారంగా రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం


విద్యార్థులతో ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వాహకులు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా పేద పిల్లలకు 27 సంవత్సరాలుగా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందన్నారు. అదే విధంగా పాఠశాల స్థాయిలో ప్రతి తరగతిలో టాపర్స్‌గా ఉన్నటువంటి విద్యార్థులకు, ఐదుగురు క్రీడాకారులకు వెండి పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ స్టేట్ ఎస్సీ కార్యదర్శి గురునాథం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, చెంచురమణయ్య, మాధవరావు, విజయబాబు, సురేంద్రరావు, భవిత తదితరులు పాల్గొన్నారు.

బాలుకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు


కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం

తొట్టంబేడు: మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన విద్య, కళలు, సాహిత్యంలో చేస్తున్న సేవలకు గాను అవార్డు ఎంపిక చేసినట్టు వే ఫౌండేషన్ అధ్యక్షుడు పైడి అంకయ్య తెలిపారు. ఈ నెల 12న తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్న వే ఫౌండేషన్ 12వ వార్షికోత్సవంలో అవార్డు అందజేస్తామని పేర్కొన్నారు.

పేట్రేగిపోతున్న గంజాయి ముఠా


గొడవ జరుగుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి : పట్టణంలో ఆకతాయిలు, గంజాయి ముఠా సభ్యులు పేట్రేగిపోతున్నారు. స్థానికులపై తరచూ దాడులకు దిగుతున్నారు. గురువారం స్వర్ణముఖి నది వంతెన వద్ద భవన నిర్మాణ కార్మికులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. వీడియో సోషల్ మీడియా వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. స్వర్ణముఖి నది వద్దకు చేరుకున్నారు. అప్పటికే దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని సమాచారం. భవన నిర్మాణ కార్మికులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో తరచూ దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

కట్ట పుట్టాలమ్మ ఆలయానికి రూ.8 లక్షల ఆదాయం


హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో రైలు కట్టకింద వెలసిన కట్ట పుట్టాలమ్మ ఆలయంలో ఏర్పాటుచేసిన హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.8,0360 ఆదాయం వచ్చినట్టు పంచాయతీ కార్యదర్శి ఎంజీ రమేష్ బాబు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హుండీలోని కానుకలను లెక్కించినట్టు తెలిపారు. ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసి అభివృద్ధి పనులకు వినియోగిస్తామని వెల్లడించారు.

టీడీపీ వర్గపోరుతో ఆగిన ఆలయ పనులు

రేణిగుంట: మండలం కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్‌లో నిర్మిస్తున్న శ్రీ రామాలయం నిర్మాణ పనులు స్థానిక టీడీపీ నాయకుల వర్గ పోరుతో ఆగాయి. ఒక వర్గం వారు గురువారం ఆలయం చుట్టూ ఫెన్సింగ్ రాళ్లు నాటే పనులు చేపట్టారు. మరో వర్గం వారు అనుమతులు లేవంటూ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ సిబ్బంది అక్కడికి చేరుకుని ఫెన్సింగ్ రాళ్లను తొలగించారు. అధికార పార్టీ నేతల అక్రమ నిర్మాణాల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించే అధికారులు ఆగమేఘాల మీద ఆలయం పనులు అడ్డుకోవడంపై విమర్శలు ఎదురయ్యా యి. టీడీపీ నాయకుల మధ్య నెలకొన్న వర్గ పోరు కారణంగానే ఆలయ పనులకు ఆటంకం కలిగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బోధనేతర పనులు బహిష్కరణ


మెమోరాండం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలకు ఏపీపీ, బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు మెమోరాండం ఇచ్చారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు ఏపీపీ, బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రోసనూరు రామచంద్రయ్య, వెంకటేష్, సురేష్, కోదండరావు, గిరిబాబు, అమరావతి, రేవతి, నాగరాజు, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

రేణిగుంట: బోధనేతర పనులను తప్పించాలని కోరుతూ శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. వారు గురువారం ఎంఈవో రఘునాథన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల పిల్లలకు పాఠ్యాంశాలు బోధించడానికి తగిన సమయం లభించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సురేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేతకు రంగం సిద్ధం!

చెంగల్రాయలగుంటలో వున్న ఇళ్లు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. నిరు పేదలు ఏళ్ల క్రితం నిర్మించుకుని కాపురం వుంటున్న ఇళ్లను కూల్చివేసేందుకు సిద్ధమయ్యారు. నోటీసులు ఇవ్వకుండానే ఇచ్చినట్టు అధికారులు ప్రకటించడంపై పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నఫళంగా ఇళ్లను తొలగిస్తే తాము ఎక్కడికి వెళ్లాలని, తమను కనికరించాలని అధికారులను వేడుకుంటున్నారు.

- నోటీసులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు ప్రకటన
- ఉన్నఫళంగా ఇళ్లు కొట్టేస్తే ఎక్కడికి వెళ్లాలని పేదల ఆవేదన
- కనికరించాలని వేడుకోలు


ఇంటి పన్నులు, ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు చూపుతున్న దళితులు


2016లో పొందిన ఇంటి పన్ను రసీదు

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ కరకంబాడి గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 453లో 9 ఎకరాల్లో గణేష్ నగర్, చంగల్రాయలగుంట ప్రాంతంలో 30 ఏళ్లుగా 500ల కుటుంబాలకు పైగా దళితులు నివాసం ఉంటున్నారు. చంగల్రాయల గుంట ప్రాంతంలో 2016లో పేదలు 33 ఇళ్లు నిర్మించుకున్నారు. వాటికి కరెంటు మీటర్లు తీసుకున్నారు. పంచాయతీకి పన్నులు సైతం చెల్లిస్తున్నారు. వాటిలో కాపురాలు వుంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలోని పలువురి పేద ప్రజల ఇళ్లను నేలమట్టం చేశారు. దీంతో చెంగల్రాయలగుంట వాసులు గత సంవత్సరంలో హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సైతం పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లించారు. గురువారం రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి చెంగల్రాయలగుంట ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడ అక్రమ కట్టడాలు నిర్మించారని, వీరందరికీ నోటీసులు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే ఇళ్లు తొలగిస్తామని ప్రకటించారు. దీనిపై దళిత నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇచ్చామని తహసీల్దార్ అబద్ధాలు చెబుతున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దళిత నిరుపేదలమైన తాము నిర్మించుకున్న ఇళ్ల జోలికి రెవెన్యూ అధికారులు రాకుండా చూడాలని కోరుతున్నారు.

10 ఏళ్లుగా కాపురం వున్నాం



మేము ఇక్కడ పదేళ్లుగా కాపురం వున్నాం. పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం. కరెంట్ మీటర్ కూడా తీసుకున్నాం. ఇప్పుడు ఉన్నట్టుండి రెవెన్యూ అధికారులు వచ్చి అక్రమ కట్టడాలు అని చెప్పడం దారుణం. ఇళ్లను కూల్చివేస్తామని చెప్పడం తగదు. ఇళ్లు కూల్చివేస్తే ఎక్కడికి వెళ్లాలి. ఎలా బతకాలి.
– భవాని, చంగల్రాయల గుంట, జ్యోతి నగర్

ఇళ్లు కూలిస్తే చావే శరణ్యం



ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాం. వాటిని కూల్చి వేస్తే మాకు చావు తప్ప మరో దారి లేదు. అధికారులు నోటీసులు ఇవ్వకుండానే ఇచ్చామని చెప్పి ఏ అర్ధరాత్రి సమయంలో వచ్చి ఇళ్లను కూల్చివేస్తే మా పరిస్థితి ఏమిటి. ఉన్నతాధికారులు న్యాయం చేయాలి.
– ఇంద్రాణి, చంగల్రాయలగుంట, జ్యోతి నగర్

నోటీసులు ఇచ్చినట్లు చెప్పడం ఏమిటి?



మాకు ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. గతంలో రెవెన్యూ అధికారుల తీరుకు భయపడి కోర్టులో స్టే ఆర్డర్ తెచ్చుకున్నాం. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే జీవిస్తున్నాము. ఇప్పుడు అక్రమ నిర్మాణాలు అనడం శోచనీయం. జిల్లా అధికారులు మాకు న్యాయం చేయాలి.
– కె.కుప్పమ్మ చంగల్రాయలగుంట, జ్యోతి నగర్

ఏర్పేడు సింగిల్ విండోలో సిక్కిం ప్రతినిధులు


ఏర్పేడు సింగిల్ విండోలావాదేవీలను పరిశీలిస్తున్న సిక్కిం రాష్ట్ర అధికారుల బృందం

ఏర్పేడు: జాతీయ సహకార సమీక్షా సదస్సులో భాగంగా తిరుపతికి విచ్చేసిన సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ సెక్రటరీ గ్లోరియా నామ్ చూ, సిక్కిం సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ కేసాన్ ధ్యాన్‌కీ బృందం గురువారం ఏర్పేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని సందర్శించింది. ఇక్కడ జరుగుతున్న వ్యాపార లావాదేవీలను పరిశీలించింది. సంఘం పనితీరు, అందజేస్తున్న సేవలను తెలుసుకున్నారు. తమ పర్యటనపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ సందర్శకుల పుస్తకంలో సంఘం పురోభివృద్ధిని కోరుతూ శుభాకాంక్షలను తెలిపారు. జిల్లా సహకార అధికారిణి ఎస్.వి.నాగవర్ధన, తిరుపతి డివిజనల్ సహకార అధికారి జే.సురేష్ కుమార్, డి.నాగభూషణం, డీపీడీఎం సంధ్యారాణి, బ్రాంచ్ మేనేజర్ తేజస్విని, బ్రాంచి సూపర్‌వైజర్ కే.రమేష్, టెక్నికల్ ఆఫీసర్ శశి కిరణ్, ఏర్పేడు సింగిల్ విండో సీఈవో వేమలయ్య పాల్గొన్నారు.